# పెన్ పవర్
తెలంగాణ రౌండప్
మంగళవారం 20 ఆగస్టు 2024 పేజీలు 8


## కౌన్సిలర్ నివాసంలో రక్షాబంధన్ వేడుకలు



**మేడ్చల్ జిల్లా బ్యూరో పెన్ పవర్ ఆగస్టు 19** సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయతల కు చిహ్నంగా నిలిచే రాఖీ పండుగను మున్సిపాలిటీలోని ప్రజలంతా సోమవారం ఆనందోత్సాహాల మధ్య వైభవంగా జరుపుకున్నారు. ప్రతీ ఇంట్లో సోదరి మణులు తమ సోదరులకు రాఖీలు కట్టి అప్యాయతను చాటారు. యువతులు, మహిళల సందడితో ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది. దమ్మాయిగూడ మున్సిపల్ కౌన్సిలర్ వసుపతి రమేష్ గౌడ్ నివాసంలో సోదరీ రమేష్ గౌడ్ కు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్ గౌడ్ కు సోదరీమణులు రాఖీ కట్టారు.



- మహబూబాబాద్ జిల్లా కేంద్రం ఎంఆర్‌పిఎస్ కాలనీలో వృక్షాలకు రక్షాబంధన్..
- మానవ మనుగడకు కారణమైన వృక్షాలు రక్షించ బడాలని వృక్షాలకు రాఖీలు కడుతూ వేడుకలు..
- 16 ఏళ్ళుగా వృక్షాబంధన్ జరుపుకుంటున్న "ప్రజా హృదయం" స్వచ్ఛంద సేవ సంస్థ..

# రక్షాబంధన్ రోజే.. అక్కడ వృక్షాబంధన్..

పదహారేళ్ళుగా చెట్లకు రాఖీలు కట్టే వినూత్న సాంప్రదాయం..

-2లో



## అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీపండుగ..

మేడ్చల్ జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి..

-2లో

## ఎమ్మెల్యే నివాసంలో రక్షాబంధన్

వివరాలు 3లో..




## ఫోటోగ్రాఫర్ కిషోర్ బాబుకు సన్మానం

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 19: ఆగష్టు 19న అంతర్జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సోమవారం సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో బేగంపేట గ్రీన్ పార్క్ హెూటల్లో ఉత్తమ ఫోటోగ్రాఫర్లకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా సమాచార శాఖ కమిషనర్ ఎం హనుమంతరావు చేతుల మీదుగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ (డిపిఆర్ఓ) ఫోటోగ్రాఫర్ కిషోర్ బాబును శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్ కిషోర్ బాబుకు తన బంధుమిత్రులు శుభాభినందనలు తెలియజేశారు..



## విలీన చక్రబంధంలో బీఆర్ఎస్



**స్టేట్ పొలిటికల్ బ్యూరో పెన్‌పవర్ హైదరాబాద్,ఆగస్టు 19:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా పురుడు పోసుకున్న పార్టీ భారత రాష్ట్ర సమితి అలియాస్ తెలంగాణ రాష్ట్ర సమితి. అనేక పోరాటాలు, లాబీయింగ్‌ల తర్వాత లక్ష్యాన్ని చేరుకుంది.

-3లో

# రక్షాబంధన్ రోజే.. అక్కడ వృక్షాబంధన్..







**మహబూబాబాద్, పెన్ పవర్, ఆగష్టు 19:**జీవకోటి మనుగడకు అత్యంత కీలక పాత్ర పోషించే వృక్షాలను సైతం సోదరసమానంగా బావించి చెట్లకు రాఖీలు కట్టీ చెట్ల ప్రాధాన్యతను చాటి చెప్పిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మందకొమురమ్మ నగర్‌లో కనువిందు చేస్తుంది.. "ప్రజా హృదయం" స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఎంఆర్‌పిఎస్ కాలనీ వాసులు కులమతాలకతీతంగా చెట్లకు రాఖీలు కట్టి వృక్షాలపై వారికున్న మమతానురాగాలను చాటుకున్నారు. ఈ సందర్భంగా వనసంరక్షకుడు ధైద వెంకన్న ఆధ్వర్యంలో హిందూ సాంప్రదాయం ప్రకారం వృక్షాలకు పసుపు కుంకుమలు పెట్టి రాఖీలు కట్టి మంగళ హారతులు ఇచ్చి వృక్ష బంధన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా రాఖీ పౌర్ణమి రోజు వృక్షాలకు రాఖీలు కడుతూ ఇదే విధంగా రక్షాబంధన్ వేడుకలు జరుపుకుంటున్నామని తెలిపారు. వృక్షో రక్షతి రక్షితః అనే నినాదంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని, మొక్కలు లేకుండా మానవులు జీవించలేరని ఉపోద్ఘాతం చేశారు.. కానీ మనం లేకున్నా మొక్కలు జీవిస్తాయని అన్నారు. వృక్షాలు లేకపోతే మానవ మనుగడకే ప్రమాదమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గుగ్గిల వీరయ్య, రజీయ బేగం తోపాటు స్థానిక మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు..





# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీపండుగ..

## మేడ్చల్ జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి..







**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 19:** ఎన్నాళ్ళయినా ఎన్నేళ్లయినా చెరిగిపోని బంధం అన్నా చెల్లెళ్ళ అనుబంధం..! అంతటి గొప్ప అనుబంధానికి ప్రతీక మన రాఖీ పండుగ అని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆరోగ్యశాఖ అధికారి(డిఎంహెచ్ఓ) డా. టి.రఘునాథస్వామి పేర్కొన్నారు.. రాఖీ పండుగను పురస్కరించుకుని సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల సముదాయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో రాఖీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు.. జిల్లా అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామికి మహిళా అధికారులు, ఉద్యోగులు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అని, ఇలాంటి పండుగను అందరూ ప్రేమాభిమానాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. మహిళల ఆరోగ్యం, భద్రత శ్రేయస్సు, కోసం తన వంతు కృషిచేస్తానని అన్నారు. తనకు రాఖీలు కట్టిన సోదరీమణులతో పాటు జిల్లాలోని ఉద్యోగులు, ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు..

# ఎమ్మెల్యే నివాసంలో రక్షాబంధన్







**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఆగష్టు 19:** శ్రావణ శుద్ధ పౌర్ణమి రక్షాబంధన్ సందర్భంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన మహిళలు, నాయకురాల్లు ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ను కలిసి "రాఖీలను" కడుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సంధర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలలో ప్రతీ పండుగలలో ఒక అర్ధం పరమార్థం దాగివుంటుందని, రాఖీ పండుగలో అన్నా చెల్లెళ్ళ అనుబంధం ఉంటుందని అన్నారు. సోదరభావాన్ని పెంచే ఈ రాఖీ పర్వదిన వేళ మహిళా సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. నేడు రాజకీయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో హ్యాట్రిక్ విజయాన్ని అందుకోవడంలో మహిళల కృషి ఎంతగానో ఉందని ఈ సంధర్బంగా పేర్కొన్నారు.

# విలీన చక్రబంధంలో బీఆర్ఎస్

- మొదటి పేజి తరువాయి

స్వరాష్ట్రం సాధించింది. తర్వాత జరిగిన ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టింది. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపింది. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంలో నీటి సమస్య పరిష్కరించింది. నిధులు నీళ్లలా ఖర్చు చేసి ధనిక రాష్ట్రం తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చింది. నియామకాలను విస్మరించింది. దీంతో పదేళ్ల తర్వాత 2023లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించారు ప్రజలు. కానీ, అప్పటికే అనేక ఆరోపణలు ఎర్కొన్న ఆ పార్టీకి అధికారం కోల్పోయాక ఇబ్బందులు మొదలయ్యాయి. కాళేశ్వరంలో కీలకమైన మేడిగడ్డ కుంగింది. సుందిళ్లకు బుంగ పడింది, ఫోన్ ట్యాపింగ్ కేసు మెడకు చుట్టుకుంది. అనేక విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలపై విచారణ జరుగుతోంది. ఈ క్రమంలో తాజాగా బీఆర్ఎస్‌కు విలీనం అంశం పెద్ద తలనొప్పిగా మారింది. అధికార కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌ను విలీనం అంశం ఆధారంగా ఆటాడుకుంటోంది. త్వరలోనే బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందని, కేసీఆర్ గవర్నర్ అవుతాడని, కేటీఆర్ కేంద్ర మంత్రి అవుతాడని, కవిత రాజ్యసభ ఎంపీ అవుతుందని ఆరోపిస్తున్నారు.బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కూతురు ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయి దాదాపు ఐదు నెలలుగా తిహార్ జైల్లో ఉంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తరచూ ఢిల్లీ వెళు్నారు. న్యాయవాదులతో, న్యాయ నిపుణులతో సమావేశం జరుపుతున్నారు. ఇదే అదనుగా కాంగ్రెస్ నాయకులు విలీనం అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. చెల్లిని విడిపించుకోవడానికి పార్టీని బీజేపీలో విలీనం చేయడానికి యత్నిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అయితే తాము బీజేపీలో విలీనం కోసం ఢిల్లీ వెళ్లడం లేదని, 23 ఏళ్లుగా పార్టీని బలంగా తీర్చిదిద్దామని, విలీనం ముచ్చటే లేదని కేటీఆర్, హరీశ్‌రావు ఖండిస్తున్నారు. అయినా ప్రచారం మాత్రం ఆగడం లేదు.

భారతీయ జనతా పార్టీ బీఆర్ఎస్ నిస్సహాయతను ఆసరాగా చేసుకుని ఆ పార్టీ తరపున ఎవరికీ రాజకీయ భవిష్యత్ లేకుండా చేసి.. చివరికి ఆ పార్టీని విలీనం చేయాలనుకునే ప్లాన్ వేస్తోందని కాంగ్రెస్ అంటోంది. అందులో భాగంగానే జరుగుతున్న ప్రతీ విషయంపై లీకుల్ని ఇస్తోందని ఆరోపిస్తోంది. కానీ దాన్ని ఖండించే పరిస్థితి బీఆర్ఎస్‌కు లేకుండా పోతోంది. ఖండించలేని దుర్భరమైన స్థితిలో బీఆర్ఎస్ బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై రేవంత్ రెడ్డి ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్ చాట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య చర్చల ప్రతిపాదనల్లో ఉన్న అంశాలను బయట పెట్టారు. ఇవి ఊహాగానాలు కాదని మీడియా ప్రతినిధులందరికీ తెలుసు. ఢిల్లీలో బీజేపీ, బీఆర్ఎస్ సుదీర్ఘ చర్చలు జరిగాయి. అందులో ఓ ఫార్ములా కూడా రెడీ అయిందని రేవంత్ బయట పెట్టారు. ఈ విషయం బయటకు వచ్చిన తర్వాత .. రేవంత్ అలా మాట్లాడారని మీడియా రిపోర్టు చేశాక కేటీఆర్ అత్యంత బలహీనమైన స్పందన వ్యక్తం చేశారు. రేవంత అమెరికా అధ్యక్షుడు అవుతాడని అంటే నమ్మేస్తారా అని పేలవరమైన సెటైర్ వేశారు. అక్కడే ఆయన ఎంత బలహీన స్థితిలో ఉన్నారో క్లారిటీ వస్తుంది. ఇక విలీనంపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. పసలేని వాదన చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిని తప్పు పట్టారు. బీఆర్ఎస్ పార్టీకి అంత సీన్ లేదని చెప్పేలా కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ లో విలీనమైతే అంత ప్రాధాన్యం ఇస్తారా అన్నట్లుగా కౌంటర్ విమర్శలు చేశారు. చివరికి కేసీఆర్, కేటీఆర్‌కు సైతం ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వకపోయినా విలీనం చేయకతప్పని పరిస్థితిని వ్యూహాత్మకంగా కల్పిస్తున్నరన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# అమల్లోకి కొత్త ట్రాఫిక్ రూల్స్

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ హైదరాబాద్, ఆగస్టు 19:** ఒకప్పుడు రవాణా సదుపాయం కోసం వాహనాలను వినియోగిస్తుంటాం. ఇప్పుడు సుఖవంతమైన ప్రయాణం కోసం, ప్రెస్టేజీ కోసం కూడా చాలా మంది వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. కొందరు ఉపాధి పొందుతున్నారు. దీంతో వాహనాల సంఖ్య పెరుగుతోంది. రోడ్లపై ట్రాఫిక్ పెరుగుతోంది. దీంతో ప్రభుత్వాలు కూడా రోడ్ల విస్తరణ చేపడుతున్నాయి. అయినా రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఆస్తి, ప్రాణ నష్టాలు జరుగుతున్నాయి. దీనికి ప్రధానం కారణం వాహనదారులు అతి వేగంగా వెళ్లడం, ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం.. మద్యం సేవించి వాహనం నడపడం లాంటి కారణాలే ఎక్కువగా ఉన్నాయి. ఈమేరకు క్రైమ్ రిపోర్ట్స్ కూడా ఇదే విషయం చెబుతున్నాయి. ప్రమాదాల బారిన పడుతన్న వారిలో ఎక్కువ మంది 30 ఏళ్లలోపు వారే ఉంటున్నారని పేర్కొంటున్నాయి. ఇక వాహనాల వాహన వేగ పరిమితులకు సంబంధించి కొత్త ట్రాఫిక్ నిబంధనలు అమలుతో రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని సూచించింది. ఈ నేపథ్యంలో వాహనాల వేగం తగ్గించేందుకు కేంద్రం కొత్త నిబంధన



అమలులోకి తెచ్చింది. అమలులోకి వచ్చిన ఈ కొత్త ట్రాఫిక్ నిబంధనల గురించి తెలుసుకుందాం.రాష్ట్రంలోని ఏ రోడ్డుపైనా కూడా గంటకు 130 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో వాహనాన్ని నడపకూడదు. ఇలా చేస్తే జరిమానాతోపాటు.. వాహనాలకు ప్రమాదం కూడా సంభవించవచ్చు. . ఈ వేగం కంటే ఎక్కువగా వెళ్తే రూ.2 వేల జరిమానా విధించబడుతుంది. జరిమానాతో పాటు.. ఆరు నెలల వరకు జైలు శిక్ష కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. అతి వేగంగా వెళ్లే వాహనాలను గుర్తించేందుకు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ఇంటర్ సెప్టర్లపైనే ఆధారపడరు. వాహనాల వేగం గుర్తించడానికి , రికార్డ్ చేయడానికి స్పాట్ , సెగ్మెంటల్ కొలతలను కూడా ఉపయోగిస్తారు. చాలా మంది వాహనదారులు కెమెరాలు కనిపించినప్పుడు మాత్రమే వేగాన్ని తగ్గించి.. మళ్లీ కొద్ది దూరం ప్రయాణించి.. తమ వాహనవేగాన్ని పెంచుతారు. ఇలా తప్పించుకోకుండా ట్రాఫిక్ పోలీసులు ఈ వ్యూహాన్ని రచిస్తున్నారు. గంటకు 130 కిమీ కంటే ఎక్కువ వేగంతో డ్రైవింగ్ చేయడం నిర్లక్ష్యంగా పరిగణించబడుతుంది. ఈ నిబంధనను ఉల్లంఘించిన వాహన యజమానులపై ఆగస్టు 15 నుంచి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు.ఈ కొత్త రూల్ ప్రకారం.. దాదాపు అన్ని వాహనాలపై ఎఫ్ఐఆర్ నమోదయ్యే అవకాశం ఉంది. ఎక్స్‌ప్రెస్ వేలలో ప్రమాదాలే వేగ నియంత్రణకు ప్రధాన కారణం. మితిమీరిన వేగం నియంత్రించడమే లక్ష్యంగా పోలీసులు చర్యలు చేపట్టారు. జరిమానాలు నివారించడానికి.. రహదారి భద్రతకు సహకరించడానికి వాహనదారులు ఈ కొత్త నిబంధన గురించి తప్పకుండా తెలుసుకోవాలి.

## హైడ్రా దూకుడుతో.. అక్రమార్కుల్లో గుబులు

**బ్యూరో రిపోర్టు పెన్‌పవర్ హైదరాబాద్, ఆగస్టు 19:** హైదరాబాద్, నగర చుట్టుపక్కల ప్రాంతాల్లో హైడ్రా ఆపరేషన్ కొనసాగుతోంది. హైడ్రా దూకుడుతో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారి గుండెల్లో గుబులు మొదలైంది. తాజాగా గండిపేట ఏరియాలో అక్రమంగా కట్టిన భవనాలను హైడ్రా ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం కూల్చివేసింది. హైడ్రా చర్యలపై నగర వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.రంగారెడ్డి జిల్లాలోని గండిపేట్ సరస్సు, ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లోని అక్రమ భవనాలను హైడ్రా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం కూల్చివేసింది. కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈ కూల్చివేతలు చేపట్టింది. సరస్సును ఆక్రమించి నిర్మించిన అపార్ట్‌మెంట్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు కూల్చివేశాయి. ఇటు హైడ్రా చర్యలను, కూల్చివేతలను నగర వాసులు స్వాగతిస్తున్నారు. తమకు తెలిసిన అక్రమ కట్టడాలు, ఆక్రమణల గురించి హైడ్రాకు తెలియజేస్తున్నారు.హైడ్రా అంటే.. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ. ఇటీవలే ప్రత్యేక స్వతంత్ర వ్యవస్థగా రేవంత్ సర్కారు దీన్ని ఏర్పాటు చేసింది. జీహెచ్ఎంసీ తోపాటు హైదరాబాద్ నగర శివార్లలోని మున్సిపాలిటీలు, గ్రామాల్లోనూ హైడ్రా ఆపరేషన్ కొనసాగుతోంది. చెరువులు, పార్కులు, లే అవుట్లలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాలు, పరిశ్రమల శాఖకు చెందిన స్థలాల్లో ఆక్రమణలను అడ్డుకోవడమే హైడ్రా ప్రధాన విధి అని ప్రభుత్వం స్పష్టం చేసింది. హైడ్రా ఏర్పాటుపై మొదట్లో విమర్శలు వచ్చినా.. ఆ తర్వాత ప్రజలు స్వాగతిస్తున్నారు. చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూములను కాపాడటం అంత ఈజీ కాదు. ఇప్పటికే ఎన్నో భూములు ఆక్రమణలకు గురయ్యాయి. వాటిల్లో కొన్నింటిని గుర్తించి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అయితే.. తాజాగా ఏర్పాటైన హైడ్రాకు ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా రాజకీయ నాయకులు హైడ్రా తీరుపై అసంతృప్తిగా ఉన్నారు. ఇప్పటికే ఓ ఎమ్మెల్యే బహిరంగంగానే హైడ్రాపై అసంతృప్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్ పరిధిలో ఎన్నో కట్టడాలు రాజకీయ నాయకుల కనుసన్నల్లోనే జరిగాయి. ఇప్పుడు వాటిని కూల్చివేయడం వీరికి మింగుడు పడటం లేదు.ప్రస్తుతం హైడ్రా కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ వ్యవహరిస్తున్నారు. గతంలో ఈయన వరంగల్ సీపీగా, హైదరాబాద్ వివిధ హోదాల్లో పని చేశారు. ఏవీ రంగనాథ్ ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గే ఆఫీసర్ కాదనే పేరుంది. గతంలో వరంగల్ సీపీగా ఉన్నప్పుడు కీలకమైన కేసుల్లో రంగనాథ్ తన మార్క్ చూపించారు. ఇప్పుడు కూడా ఆయనపై ఒత్తిడి పెరిగింది. ముఖ్యంగా పొలిటికల్ ప్రెషర్ ఎక్కువైంది. కానీ.. రంగనాథ్ వాటిని లెక్క చేయకుండా అక్రమార్కుల భరతం పడుతున్నారు. రంగనాథ్ గురించి తెలిసే రేవంత్ రెడ్డి ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారని తెలుస్తోంది

## ఉప్పలయ్య వంట...మన ఇంటి వంటే

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ వరంగల్, ఆగస్టు 19:**



హోటల్ అనగానే ప్రధాన రోడ్డు వెంట భారీ బోర్డులు, రంగురంగుల లైటింగ్ తో కస్టమర్లను ఆకట్టుకోవడం విశ్వ ప్రయత్నం చేస్తారు. అంతే కాదు వినూత్నంగా డైనింగ్ టేబుల్స్, మెనూ కార్డ్ టేబుల్ పైన ఉంటాయి. కానీ ఈ హోటల్లో ఇవేమి కనిపించవు. సాదాసీదా గా ఓ గల్లీలో చిన్న రేకుల ఇంట్లో. ఇంటి భోజనంలా రుచికరమైన భోజనాన్ని అందిస్తున్న హోటల్ భారత ప్రభుత్వం నుండి అవార్డు అందుకుంది వరంగల్ జిల్లాలోని ఉప్పలయ్య హోటల్.ఉరుకులు పరుగుల జీవితంలో ఇంటికి వెళ్లి భోజనం చేసే సమయం లేదు. దీంతో గల్లీ కో రెస్టారెంట్ లు, హోటల్స్ వెలుస్తున్నాయి. బీజీ జీవితంలో ఎక్కడో అక్కడ తినాల్సిన పరిస్థితి. జనాలు కూడా ఫాస్ట్ ఫుడ్, బిర్యాని లు తినే కాలం. అయినా సదా సీదా సాంప్రదాయ భోజనం అందిస్తున్నారు వరంగల్ జిల్లా నర్సంపేట కు చెందిన శ్రీనివాస్. 30 సంవత్సరాల క్రితం శ్రీనివాస్ తండ్రి ఉప్పలయ్య ఆయన పేరుతో నర్సంపేట పట్టణంలోని సుభాస్ కాలనీలో తన చిన్న ఇంట్లో ఇంటి భోజనాన్ని ప్రారంభించారు. ఇంట్లో అమ్మ భార్య చేసే రుచిని అందిస్తూ అందరిని మన్ననలు పొందారు ఉప్పలయ్య. దీంతో హోటల్ చిన్నదా పెద్దదా అనే సంబంధం లేకుండా రుచికరమైన ఇంటి భోజనాన్ని అందిస్తుండడంతో ఉప్పలయ్య హోటల్ భారత ప్రభుత్వం గుర్తించే స్థాయికి ఎదిగింది.ఈ హోటల్ లో బయటి వర్కర్స్ తో పని చేయించకుండా. ఉప్పలయ్య ఆయన కుమారుడు, కూతురు, కోడలు స్వయంగా వంతచేయడం, హోటల్ కు వచ్చే కస్టమర్స్ కు వడ్డించడం చేస్తారు. దీంతో రుచిలో తేడా రాకపోవడంతో మనం తినే భోజనాన్ని అందించాలని హోటల్ ను నడిపాడు ఉప్పలయ్య. అయితే ఉప్పలయ్య 2004లో మరణించారు. అప్పటికే ఉప్పలయ్య కుమారుడు శ్రీనివాస్ హోటల్ నిర్వహణలో కొనసాగుతుండటంతో తండ్రి అందించిన ఇంట్లో తినే భోజనాన్ని అందిస్తుండడంతో విజయవంతంగా కొనసాగుతుంది. మూడు రకాల కూరగాయలు, పచ్చిపులుసు, పెరుగుతో 90 రూపాయలకు ఫుల్ భోజనం అందిస్తారు. ఇక్కడికి గెజిటెడ్ ఆఫీసర్ నుంచి రోజు వారి కూలి వరకు ఇక్కడ భోజనం చేసి వెళ్తారు. వివిధ పనుల మీద నర్సంపేట పట్టణానికి వచ్చిన వారు ఇంటి భోజనం చేయాలనుకుంటే ఉప్పలయ హోటల్ కు వస్తారు.రెండు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం (మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ ) అధికారులు విధినిర్వహణలో నర్సంపేట కు వచ్చారు. భోజనం కోసం ఉప్పలయ్య హోటల్ లో భోజనం చేసి వెళ్ళారు. తిరిగి ఆగస్టు 12వ తేదీన వచ్చి భోజనం చేసిన తరువాత సాధారణ ధరకు నాణ్యమైన, రుచికర భోజనం అందించి నందుకు ఉప్పలయ్య హోటల్ యజమాని శ్రీనివాస్ కు అవార్డు అందజేశారు. హోటల్ అధికారులు మెచ్చుకొని అవార్డు ఇవ్వడంతో ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యానని శ్రీనివాస్ తెలిపారు. ఈ హోటల్లో అన్నం కూరలు సాంప్రదాయం ద్దంగా కట్టెల పొయ్యి మీద వండడం జరుగుతుంది. పోపుకు సంబంధించిన వాటిని మాత్రమే గ్యాస్ మీద చేయడం జరుగుతుంది శ్రీనివాస్ తెలిపారు. 150 నుండి 200 భోజనాలు అందిస్తానని చెప్పారు. భోజనం చేసిన వారు రుచికరంగా ఇంట్లో తిన్నట్టు ఉందని అంటే ఆనందం అనిపిస్తుందని శ్రీనివాస్ అన్నారు.

# కంటిలో నలుసులా బావ, బామ్మర్ది...

**బ్యూరో రిపోర్టు పెన్‌పవర్, హైదరాబాద్, ఆగస్టు 19**
తెలంగాణ రాజకీయ కురుక్షేత్రంలో కృష్ణార్జునులు కేటీఆర్, హరీశ్‌రావు? ఈ ఇద్దరు బావా బామ్మార్దులు అధికార కాంగ్రెస్‌కు కంట్లో నలుసులా మారారు. ఆపరేషన్ కృష్ణార్జున?. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తెరపైకి తెచ్చిన ఆపరేషన్ ఇది. ప్రభుత్వంపై మాటల దాడి చేస్తున్న విపక్ష నేతలు హరీశ్‌రావు, కేటీఆర్‌ను టార్గెట్ చేయడటమే ఈ ఆపరేషన్ ప్రధాన ఉద్దేశం. గత 8 నెలలుగా ప్రభుత్వంపై అవిశ్రాంత పోరాటం చేస్తున్న ఈ ఇద్దరు బావా బామ్మార్దులు?. సీఎం రేవంత్‌రెడ్డికి చికాకుగా తయారయ్యారంటున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కొద్దిరోజులుగా సైలెంట్ అయిపోయినప్పటికీ.. తమ బాస్‌ను మించి ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ.. ప్రతి సందర్భంలోనూ అధికార పక్షాన్ని కార్నర్ చేస్తున్నారు బావబామ్మర్దులు. దీంతో ఈ ఇద్దరి కట్టడే ఇప్పుడు కాంగ్రెస్ టార్గెట్ గా పెట్టుకుంది. కేటీఆర్, హరీశ్‌రావును ఆపితే చాలు? కాంగ్రెస్ పార్టీకి ఎదురే ఉండదని భావిస్తున్నారు ఆ పార్టీ నేతలు. బీఆర్ఎస్‌లో మిగిలిన నేతలను పక్కనపెట్టి కేటీఆర్, హరీశ్‌రావును టార్గెట్ చేస్తూ ముందుకు వెళ్లడమే సర్కార్ వ్యూహంగా తెలుస్తోంది. వారిద్దరినీ టార్గెట్ చేయాలని కేడర్‌కు సందేశం పంపారట ప్రభుత్వ పెద్దలు. అందుకే రెండు రోజులుగా హరీశ్‌రావు, కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ నిరసనలు ఉధృత మయ్యాయంటున్నారు. అసెంబ్లీలోనూ బయటా ఒకరి తర్వాత ఒకరు గుక్క తిప్పకుండా విమర్శలు గుప్పిస్తుండటంతో ఆ ఇద్దరిని ఆపేదెలా? అని ఆలోచించిన ప్రభుత్వం పకడ్బందీ వ్యూహరచన చేసిందంటున్నారు. ఏ చిన్న అవకాశం లభించినా? హరీశ్‌రావు, కేటీఆర్‌ను వదలొద్దని కేడర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందంటున్నారు. రుణమాఫీ అంశంపై హరీశ్‌రావు రాజీనామా చేయాలని కాంగ్రెస్



ఆందోళనలు చేయడం? ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మహిళా కమిషన్ నోటీసులు జారీ చేయడం వెనుక ఆపరేషన్ కృష్ణార్జున వ్యూహమే ఉందంటున్నారు. 8 నెలల కాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం ఎంతలా కష్టపడినా, అందరికీ రుణమాఫీ జరగలేదని హరీశ్‌రావు నానాయాగీ చేస్తున్నారని మండిపడుతోంది కాంగ్రెస్. గతంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు? రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగలేదని ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో తాము లక్ష మాఫీ చేస్తేనే 17 వేల కోట్లు వెచ్చిస్తే? ఇప్పుడు రెండు లక్షల మాఫీకి ఇంచుమించు అంతేమొత్తం కేటాయించడంపై అనుమానాలు లేవనెత్తుతున్నారు హరీశ్‌రావు. దీంతో హరీశ్ టార్గెట్ గా ఎదురుదాడి మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. రుణమాఫీ జరిగితే తాను రాజీనామా చేస్తానని గతంలో హరీశ్‌రావు చేసిన సవాల్‌ను తాజాగా తెరపైకి తెచ్చి?. ఊరూరా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు కాంగ్రెస్ కార్యకర్తలు. రుణమాఫీ జరిగినందున హరీశ్‌రావు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక తొలి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య డైలాగ్ వార్ నడుస్తూనే ఉంది. తాజాగా కొందరు మహిళలు బస్సులో వెల్లుల్లి వేరడం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టగా, మరోమారు రెండు పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు చోటుచేసుకున్నాయి. ఈ సమయంలోనే ఉచిత బస్సుపై విమర్శలు చేసిన కేటీఆర్? మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఆక్షేపిస్తూ? సుమోటాగా నోటీసులు జారీ చేసింది మహిళా కమిషన్. దీంతో కేటీఆర్ కూడా తన వ్యాఖ్యలను ఉపసంహకుంటూ క్షమాపణ చెప్పేశారు. అయినా కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయాలని ఊరూరా కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునివ్వడం.. ఈ నెల 24న తన ముందు విచారణకు హాజరుకావాలని మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద ఆదేశాలివ్వడం వెనుక కాంగ్రెస్ వ్యూహం ఉన్నట్లు టాక్ నడుస్తోంది. దీంతో ఒకే సమయంలో ఇటు హరీశ్, అటు కేటీఆర్‌ను కార్నర్ చేస్తూ రాజకీయాన్ని రక్తికట్టిస్తోంది కాంగ్రెస్. బీఆర్ఎస్ బాస్ కేసీఆర్ మంచి వాగ్దాటి ఉన్న నేత. సీఎం రేవంత్‌రెడ్డికి తగ్గట్టుగా కేసీఆర్ వాగ్బాణాలు సంధించగలరు. ఈ ఇద్దరి మధ్య మాటల యుద్ధం ఓ రేంజ్లో ఉంటుంది.

ఐతే ఎన్నికల్లో ఓటమి తర్వాత కేసీఆర్? తన పాత్రను కేటీఆర్, హరీశ్‌రావుకు అప్పగించారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఈ ఇద్దరూ కృష్ణార్జుల్లా పోరాడుతున్నారు. ఇదేసమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వరుసగా పార్టీని వీడుతున్నా, ఈ ఇద్దరు మాత్రం ఎక్కడా వెనక్కి తగ్గడం లేదు. అవకాశం చిక్కిన ప్రతి సమయంలోనూ ప్రభుత్వాన్ని కార్నర్ చేస్తున్నారు. దీంతో ఇద్దరు బావా బామ్మార్దులను ఆపితే? బీఆర్ఎస్‌లో మాట్లాడేవారే ఎవరూ ఉండరని? గులాబీదళంపై పైచేయి సాధించొచ్చని భావిస్తోంది కాంగ్రెస్. అందుకు తగ్గట్టు పావులు కదుపుతుండటంతోనే ఒకే సమయంలో కేటీఆర్, హరీశ్రావుకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నిరసనలు చేస్తోందంటున్నారు. మొత్తానికి ఆపరేషన్ కృష్ణార్జునుల ఎపిసోడ్‌కు ఎలాంటి ముగింపు వస్తుందో? ఎవరు తగ్గుతారో? ఎవరు నెగ్గుతారో చూడాల్సి ఉంది.

# ఎమ్మెల్యేల యందు... కిషన్ ఎమ్మెల్యేలు వేరయా....



**బ్యూరో రిపోర్టు పెన్‌పవర్, హైదరాబాద్, ఆగస్టు 19:**
తెలంగాణలో అధికారమే లక్ష్యంగా.. గత ఎన్నికల్లో వ్యూహాత్మకంగా ముందుకు సాగిన కమలదళం కేవలం ఎనిమిది సీట్లను మాత్రమే కైవసం చేసుకుంది. గతంతో పోలీస్తే.. బీజేపి మంచి సీట్లు, ఓట్లు సాధించినా.. అనుకున్న లక్ష్యానికి దారిదాపుల్లోకి వెళ్లలేకపోయింది. ఈ అంశాన్ని అలా ఉంచితే.. గెలిచిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేసి.. అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాల్సిందిపోయి.. ఎవరికీ వారే యమునా తీరే అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారనే వార్తలు గుప్పుమంటున్నాయి. ఇప్పటికే ఎమ్మెల్యేలు రెండు గ్రూపులుగా విడిపోయినట్లు సమాచారం. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేల మధ్య సమన్వయం లేకపోవడం స్పష్టంగా కనిపించిందని పార్టీ వర్గాలతో పాటు రాజకీయ నిపుణులు కూడా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డితో.. కొంతమంది ఎమ్మెల్యేలకు పొసగడం లేదని వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. ఇందులో ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో పాటు మరికొంత మంది ఎమ్మెల్యేలు ఉండటంతో.. బీజేపీ వర్సెస్ బీజేఎల్పీ అన్నట్టుగా పరిస్థితి తయారైందనే వాదనలు ఉన్నాయి. దీంతో ఏలేటి తన మకాం అసెంబ్లీకి మార్చారట. మీడియా కార్యక్రమాలన్నీ పార్టీ ఆఫీసులో కాకుండా అసెంబ్లీ బీజేఎల్పీ కార్యాలయానికి షిఫ్ట్ చేసుకున్నారు. ఇప్పటికే సగం మంది ఎమ్మెల్లేలు.. శాసనసభాపక్ష నేతగా ఏలేటిని ఇష్టపడడం లేదు. ఎమ్మెల్యేలే కాదు.. రాష్ట్ర అధ్యక్షుడు కూడా దీనిపై వ్యతిరేకంగా ఉన్నట్టు సమాచారం. ఏలేటి వ్యవహారం.. కిషన్‌రెడ్డికి నచ్చడం లేదనే చర్చ ఆ పార్టీ వర్గాల్లోనే జోరుగా వినిపిస్తోంది. మరోవైపు.. బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి, ఆ పార్టీ ఎమ్మెల్యేల మధ్య మరో వార్ మొదలైనట్లు విస్తృతంగా చర్చ నడుస్తోంది. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులుగా గెలిచిన ఎమ్మెల్యేలకు రాష్ట్ర నాయకత్వం సముచిత స్థానం కల్పించడంలేదని పలువురు ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. కొంతమంది ఎమ్మెల్యేలు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ సొంత నియోజకవర్గానికే పరిమితం అవుతున్నారు. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై రాష్ట్ర నాయకత్వం.. ఎమ్మెల్యేలకు ఎలాంటి దిశానిర్ధేశం చేయలేదు. దీంతో.. ఎమ్మెల్యేలు సభలో ఏం మాట్లాడాలో అర్థంకాక సతమతమయ్యారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేల్లో ఇద్దరికీ మాత్రమే అనుభవం ఉంది. మిగతా ఆరుగురు ఎమ్మెల్యేలు.. కొత్తగా శాసనసభకు ఎన్నికయ్యారు. సభలో లేవనెత్తాల్సిన సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపై సబ్జెక్ట్ అందించాల్సిన పార్టీ అధినాయకత్వం ఏ మాత్రం పట్టించుకోలేదని ఎమ్మెల్యేలు వాపోయారు. పార్టీకి, ఎమ్మెల్యేలకు మధ్య నడుస్తున్న అంతర్గతపోరుతో సతమతమవుతుంటే.. ఉన్న ఎనిమిది మంది ఎమ్మెల్యేల్లోనూ కూడా రెండు గ్రూపులుగా విడిపోయినట్లుగా ప్రచారం జోరుగా నడుస్తోంది. అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యేల మధ్య నెలకొన్న అంతర్గత గందరగోళంతో సమన్వయం లేదని స్పష్టంగా తెలుస్తోంది. శాసనసభాపక్ష నేతగా ఉన్న ఏలేటి మహేశ్వర్ రెడ్డి.. అందరినీ కలుపుకోని పోవాల్సింది పోయి? అన్ని తానే అన్నట్లుగా వ్యవహారంచడంతో మిగితా ఎమ్మెల్యేలంతా.. అసహానాన్ని బయట పెట్టుకున్నారట. తాము ఎమ్మెల్యేలమేనని.. పార్టీ తరపున ప్రజల గొంతును వినిపించాల్సిన బాధ్యత ఉందని బహిరంగంగానే చెప్పుకొంటున్నట్లు సమాచారం. దీంతో శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మిగతా ఎమ్మెల్యేలకు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చినా.. సబ్జెక్ట్ అందించడంలో బీజేపీ, బీజేఎల్పీ విఫలమైనట్లు పొలిటికల్ సర్కిల్లో చర్చ నడుస్తోంది. అంతేకాదు. గత ప్రభుత్వ వైఫల్యంలో భాగంగా సుంకిశాల ప్రాజెక్టు కుప్పకూలిపోవడంతో.. ఆ ప్రాజెక్టు సందర్శించాలని బీజేఎల్పీ పిలుపునిచ్చింది. కానీ.. సుంకిశాల సందర్శనకు ఐదుగురు ఎమ్మెల్లేలు డుమ్మా కొట్టడంతో ఎమ్మెల్యేల మధ్య ఉన్న గ్రూపులు మరోసారి బయటపడ్డాయి. పార్టీని బలోపేతం కోసం పని చేయాల్సిన శాసన సభ్యులు తలోదారి అన్నట్లుగా వ్యవహారించడం వల్ల కాషాయశ్రేణులు అయోమయంలో పడ్డాయి. సుంకిశాల ప్రాజెక్టు సందర్శనకు ఎమ్మెల్యేల బృందం వెళ్లాలని బీజేఎల్పీ తీర్మానం చేసింది, దానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అందుకు భిన్నంగా వ్యవహారం నడిచింది. కేవలం సుంకిశాల పర్యటనకు ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ మాత్రమే వెళ్లి అక్కడ పరిశీలన చేశారు. మిగతా ఐదుగురు ఎమ్మెల్యేలూ గైర్హాజరు కావటం పెద్ద రచ్చే రేపుతోందట. శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి మాత్రమే సుంకిశాల సందర్శనకు వెళ్లారు. మిగతా ఐదుగురు ఎమ్మెల్యేలైన.. రాజాసింగ్, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పైడి రాకేష్ రెడ్డి సందర్శనకు వెళ్లలేదు. సమాచారం అందించినా.. నియోజకవర్గాల్లో కార్యక్రమాల నేపథ్యంలో రాలేకపోయారని మిగతా సభ్యులు చెబుతున్నారు. అయితే విభేదాల కారణంగానే వారు ఆ కార్యక్రమానికి హాజరుకాలేదనేది పార్టీల్లో చర్చించుకుంటున్నారట. మరోవైపు కిషన్‌రెడ్డి వర్గ ఎమ్మెల్యేలు సుంకిశాల పర్యటనకు దూరంగా ఉన్నారని.. కిషన్ రెడ్డి పిలుపు మేరకే వారంతా పర్యటనకు రాలేదనే చర్చ సాగుతోంది. అంతేకాదు.. సుంకిశాల ప్రాజెక్టు గోడ కూలిన ఘటనపై బీజేఎల్పీ పర్యటన తరువాత బీజేపీ రాష్ట్ర నాయకత్వం నుంచి కనీసం ప్రకటన విడుదల చేయకపోవడం?. ఇప్పుడు వస్తున్న గ్రూపుల రాజకీయాలకు బలం చేకూరినట్లు అవుతోంది. శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాత్రమే దీనిని ఖండించారు. ఏలేటిపైన రాష్ట్ర నాయకత్వం ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. సుంకిశాల ప్రాజెక్టు సందర్శనకు వెళ్లాలని పార్టీ చెప్పనందుకే మిగతా ఎమ్మెల్యేలు వెళ్లలేదనే ప్రచారమూ నడుస్తోంది. మరోవైపు.. బీజేఎల్పీనేత ఏలేటి వ్యవహారశైలి వల్లే ఐదుగురు ఎమ్మెల్యేలు గైర్హాజరు అయ్యారని పార్టీ శ్రేణులు గుసగుసలాడుకుంటున్నాయి. మొత్తానికి ఈ ఎపిసోడ్ ఎక్కడవరకూ దారి తీస్తుందో తెలియక బీజేపీ కార్యకర్తలు ఆందోళనతో ఉన్నట్లు తెలుస్తోంది.

# ట్రైబల్ మ్యూజియంను సందర్శించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.



**హైదరాబాద్ పెన్ పవర్:**మారుమూల దట్టమైన అటవీ ఆదివాసి గిరిజన గ్రామాలలో నివసించిన పాత తరం ఆదివాసి గిరిజన కుటుంబాలు ఎవరి దయాదాక్షిణ్యాల వల్ల జీవించ లేదని, వారి యొక్క కాయ కష్టాన్ని నమ్ముకుని సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కాపాడుకుంటూ జొన్న, గటక, రాగి సంగటి వంటి ఆహారం తీసుకొని దేహంలో శక్తిని కూడగట్టుకొని వంద సంవత్సరాల పైనే జీవించారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు.

సోమవారం భద్రాచలం ఐటిడిఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైనింగ్ ఇన్స్టిట్యూషన్ అహ్మదాబాద్ నుండి వచ్చిన ప్రొఫెసర్ మను మరియు సంకల్ప బృందంతో ఆయన సందర్శించి, మ్యూజియం లోని పాత తరం సంబంధించిన ప్రతి వస్తువుకు సంబంధించిన అంశము గిరిజనులు వాడిన వస్తువుల యొక్క విధానము వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసి గిరిజన గ్రామాలలోని జీవన విధానాలు, సాంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు చాలా భిన్నంగా ఉంటాయని, ఆదివాసి గిరిజన గ్రామాలలో ఏ కార్యం తలపెట్టిన తప్పనిసరిగా పూజా కార్యక్రమాలు ఊరంతా కలిసి చేస్తారని ఆయన వారికి వివరించారు. ఇప్పటికీ కొన్ని ఆదివాసి గిరిజన గ్రామాలలో పాత తరం గిరిజన కుటుంబాలు వారి ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు పాటిస్తూ నేటి తరానికి మార్గదర్శకులుగా నిలుస్తూ గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలు అంతరించి పోకుండా కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన అన్నారు. అనంతరం మ్యూజియంలో పొందుపరిచిన కళాకృతుల ను బృందం సభ్యులతో కలిసి పరిశీలించి నాయక పోడ్ , కోయతెగ కళాకారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ట్రైబల్ మ్యూజియ ము అభివృద్ధి పరచాలంటే మ్యూజియం లోని కళాకృతులు బాహ్య ప్రపంచానికి తెలిసే విధంగా ఉండాలని అన్నారు. మనలో ఉన్న కళను వేరే వారు గుర్తించాలంటే మనం తయారు చేసిన వస్తువులను టూరిస్టులు ఆకర్షించే విధంగా ఉండి, పది కాలాలపాటు మన్నికంగా ఉండేలా తయారు చేయాలని అన్నారు. త్వరలో ఇక్కడ ఉన్న వివిధ కళా రూపాలు తయారు చేస్తున్న కళాకారులను హైదరాబాదు కి పంపి పెద్ద పెద్ద మాల్స్ లలో ఉండే కళలకు సంబంధించిన వస్తువుల గురించి మెలకువలు తెలుసుకునే విధంగా అవగాహన కల్పిస్తామని, మీరు తయారు చేసే వస్తువులు కోయ బొమ్మలే కాకుండా ఇంటికి పనికి వచ్చే ప్రతి వస్తువును శాస్త్రీయ పరంగా తయారు చేసి అమ్మకాలు జరిపేలా చూస్తామని, మ్యూజియం చూడ్డానికి వచ్చే ప్రతి ఒక్కరు ఆదివాసి వంటకాలు తయారు చేసి ఆదివాసి వంటకాలు రుచి చూసి, ఈ కళాకృతులకు సంబంధించిన ప్రతి వస్తువును ఆర్డర్ తీసుకొని వారికి నెలలో అందించినప్పుడే మీ కళలపై వచ్చిన వారికి నమ్మకం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఏసీఎంవో రమణయ్య, ఏటీడీవో అశోక్ కుమార్, ఆర్ ఐ నరసింహారావు, మ్యూజియం ఇంచార్జ్ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఏటిఏ నూతన జిల్లా ప్రధాన కార్యదర్శిగా నానమాద్రి సత్యనారాయణ.



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విస్తృత స్థాయి సమావేశం లో భద్రాచలం పట్టణానికి చెందిన సీనియర్ ఉపాధ్యాయుడు నానమాద్రి. సత్యనారాయణ ను ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా నియమించుటపట్ల భద్రాచలం. ఏ టి ఏ మండల అధ్యక్షులు రేసు వెంకటేశ్వర్లు ఆర్థిక శుభాకాంక్షలు తెలియజేశారు. సత్యనారాయణ వివిధ ఉపాధ్యాయ సంఘాలలో కీలక పాత్ర పోషించి, ఆదివాసి సమాజంపై జరుగుతున్న అన్యాయాలు , హరిస్తున్న హక్కులను, చట్టాలను రక్షించుటకు ఆదివాసి ఉపాధ్యాయ సంఘం లో పనిచేస్తూ, అంచులంచెలుగా ఎదిగి జిల్లా ప్రధాన కార్యదర్శి పదవిని పొందారని కొనిఆడారు.

ఏటిఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. సత్యనారాయణ మాట్లాడుతూ భవిష్యత్ ఆదివాసి సమాజ ఉద్యమ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని సమస్యల సాధనకు వెనకడుగు వేయకుండా ముందుకు వెళ్లి సాధించుటకు కృషి చేస్తానని, ఉపాధ్యాయ సమస్యల పై రాజీలేని మరియు అలుపెరగని పోరాటాలు చేసి ఉపాధ్యాయులకు శాఖా పరమైన సర్వీస్ ను అందజేస్తానని, రాష్ట్ర శాఖ నాకు అప్పగించిన బాధ్యతల ను తూచా తప్పకుండా పాటించి, సంఘ బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తానని, తన అవసరం ఎక్కడ ఉంటుందో అక్కడ తను ఉంటానని, ఏ సమస్య వచ్చినా దాని సాధించే దిశగా అడుగులు వేస్తానని, అందర్నీ సమన్వయంతో కలుపుకొని సంఘాన్ని ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏ టి ఏ మండల ప్రధాన కార్యదర్శి తెల్లం శ్రీనివాసరావు, కలం సత్య నారాయణ, కుంజ బక్కయ్య, ఎట్టి సీతారామమ్మ, సోడి శ్రీదేవి, కాక శ్రీదేవి, చవలం వెంకటేష్. మెస్ సంతం తదితరులు పాల్గొని హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.

## గౌతమి ఘాట్ ఫోటోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రాఫీ దినోత్సవ వేడుకలు.

- వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం.




**హైదరాబాద్ పెన్ పవర్:**భద్రాచలం పట్టణంలోని గోదావరి కరకట్ట వద్ద, గౌతమి ఘాట్ ఫోటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షులు ఫణీంద్ర ఆధ్వర్యంలో.. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫీ పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి, యూనియన్ గౌరవ అధ్యక్షులు రేడిన్ ల్యాబ్ రమేష్ పూలమాలవేసి నివాళిలర్పించారు. అనంతరం కూనవరం రోడ్డులో ఉన్న సరోజిని వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 40 మంది ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## రైతు రుణమాఫీ పై అన్ని మండలాల్లో ప్రజావాణి.

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్..

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా 12-డిసెంబర్-2018 నుండి ఆగస్టు 15 2024 వరకు రైతులు బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారిలో రుణమాఫీ కానీ వారు దరఖాస్తు చేసుకోవాలని, జిల్లాలోని 23 మండలాల్లో వ్యవసాయ అధికారులు (ఏ ఓ) మంగళవారం నుండి 30-08- 2024 వరకు రైతు రుణమాఫీ పై ప్రజావాణి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు రైతు రుణమాఫీ కానీ రైతులందరూ తమ తమ మండలాల్లోని వ్యవసాయ అధికారులను (ఏ ఓ) కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలి అని తెలిపారు. జిల్లాలోని అర్హత కలిగిన రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చెల్లిస్తుందని. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆయన తెలిపారు. ప్రభుత్వం రైతులకు కల్పించిన ఈ సదావకాశాన్ని అర్హులైన రైతులందరూ సద్వినియోగ పరుచుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఏదేని సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కానీ రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ దరఖాస్తులను వ్యవసాయ శాఖ సంబంధిత పోర్టల్ లో ఆన్లైన్ చేస్తామని తెలిపారు. జిల్లాలోని 23 మండలాల వ్యవసాయ అధికారుల పేర్లు మరియు ఫోన్ నెంబర్లు కింద పొందుపరిచారు.



## ఏరియా జిఎంకి ఇతర అధికారులకు రాఖీలు కట్టి రాఖీ శుభాకాంక్షలు తెలిపిన సేవా సభ్యులు.



**హైదరాబాద్ పెన్ పవర్:**అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని సింగరేణి ఎంప్లాయిస్ వైఫ్స్ అసోసియేషన్ సేవా ఆధ్వర్యంలో సోమవారం ఏరియా జిఎం దుర్గం రాంచందర్ కి ఇన్ ఛార్జ్ ఎస్ఓటు జిఎం పి వీరభద్రరావుకి, ఏజీఎం సివిల్ ధనసరి వెంకటేశ్వర్లుకి, ఏరియా ఇంజనీర్ ఆర్ శ్రీనివాస్ కి, అధికార ప్రతినిధి ఎస్ రమేష్ కి ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రామారావుకి, బదిలీ అధికారి జెవి రమణకి, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ షబ్బీరుద్దీన్ కి, పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు సింగ్ శ్రీనివాస్, రామేశ్వర్, పిఏ రాంబాబు, గుర్తింపు సంఘం నాయకులు వై రామ్ గోపాల్, ప్రాతినిధ్య సంఘం నాయకులు వత్సవాయి కృష్ణంరాజు తదితరులకు రాఖీలు కట్టి స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేవా కార్యదర్శి షేక్ షాకీరా బేగం, యస్ డి జమేలా బేగం, పులి శెట్టి సంధ్య, రాయుడు సత్యవతి, ఎం సత్యవతి, ఎస్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు.



**హైదరాబాద్ పెన్ పవర్:**దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. దిశా కమిటీ సభ్యులు భద్రాచలం ఏ ఎస్ పి అంకిత్ కుమార్ కి రాఖీ కట్టి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు పూజల లక్ష్మీ మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు డివి రాజు ఉపాధ్యక్షురాలు కళ్యాణిల ఆదేశానుసారు జిల్లా వ్యాప్తంగా దిశ ఆధ్వర్యంలో రక్షబంధన్ వేడుకలను నిర్వహిస్తున్నామని అన్నారు. దేశంలో యువతులపై రోజురోజుకీ పెరిగిపోతున్న లైంగిక దాడులను నిరసిస్తూ ప్రతి యువతిని ప్రతి ఒక్కరు సోదరిగా భావించాలని ఈ రక్షాబంధన్ సందర్భంగా దిశ పిలుపునిస్తుందని అన్నారు. కలకత్తా లో జరిగిన వైద్య విద్యార్థిని హత్యకు దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనల సమయంలో మాకు అండగా ఉండండి ఆడపిల్లలను రక్షించండి అంటూ దేశవ్యాప్తంగా యువతులు రాఖీలు కట్టి తమ ఆవేదనలను తెలియజేస్తున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దిశా ప్రొటెక్షన్ రిపేర్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# కలకత్తా వైద్య విద్యార్థి అత్యాచార హత్య ఘటనపై ఎం.వి.ఆర్ కళాశాల విద్యార్థుల నిరసన

- 700 మంది విద్యార్థినీ విద్యార్థులతో ఆధ్యాపకుల బృందం భారీ ర్యాలీ...
- వుయ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలులి
- చట్టాలు కట్టిన తరం చేస్తే ఇలాంటివి పునరా వృతం కావు
- 1947 చట్టాలతో లాభం లేదు అంటున్న ప్రిన్సిపల్



హైదరాబాద్ పెన్ పవర్: గంగవరం మండలం ఎంవిఆర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు సుమారు 700 మంది కోల్కతా వైద్య విద్యార్థి హత్యాచారం ఘటనపై,సోమవారం మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో కళాశాల వద్ద నుండి పలమనేరు అంబేద్కర్ సర్కిల్ వరకు ప్లకార్డ్స్ చేతబట్టి వుయ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎం. వి.ఆర్ కాలేజ్ ప్రిన్సిపల్ లక్ష్మీ సుధా వైస్ ప్రిన్సిపాల్ శ్వేత మాట్లాడుతూ, కోల్కతా ఘటన సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉంది నేరస్థుడు ఎంతటి పెద్దవాడైనా సరే వెంటనే శిక్ష వేయాలన్నారు, 1947 చట్టాలతో లాభం లేదు
ఇకనైనా ప్రభుత్వాలు గట్టి చట్టాలు తెచ్చి ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఆడపిల్లల పైన అత్యాచారాలు ముఖ్యంగా వయసుతో సంబంధం లేకుండా ఆడపిల్లల పైన దారుణాలు జరుగుతుంటే ప్రభుత్వాలు ఎందుకు గట్టి చర్యలు తీసుకోవడం లేదు.
కచ్చితంగా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వాల పైన ఉందన్నారు.
విద్యార్థులు మాట్లాడుతూ..
కలకత్తా వైద్య విద్యార్థి హత్యాచారం ఘటన యావత్ భారతదేశం దిగ్భ్రాంతి చెందింది. ఆడపిల్లకు భద్రత లేకుండా పోతోంది ఇల్లు బడి వైద్యశాల తేడా లేకుండా ఎంతోమంది ఎన్నో రకాలుగా నరకం అనుభవిస్తున్నారు. ముఖ్యంగా మగవారు ఆడపిల్లల పైన చూసే చూపులో మార్పు రావాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పుడు ఆలోచన పెట్టుకోకూడదు. ఆడపిల్ల పైన ఇలాంటి ఆకృత్యాలు జరిగితే వెంటనే శిక్షలు అమలు చేయాలి అలాంటప్పుడే ఇలాంటివి ఆగుతాయన్నారు.

# మున్సిపల్ సిబ్బంది తో కలిసి రాఖీ వేడుకలను జరుపుకున్న మున్సిపల్ చైర్ పర్సన్



హైదరాబాద్ పెన్ పవర్:మున్సిపల్ సిబ్బందికి రాఖీలు కడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ మేకల రమ్య నాగరాజు
రాఖీ పండుగ సందర్భంగా సోమవారం కొల్లాపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందికి మున్సిపల్ చైర్ పర్సన్ రమ్య నాగరాజు రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ రమ్య నాగరాజు మాట్లాడుతూ సోదర సోదరీమణుల ఆప్యాయత మరియు అనురాగాలకు ప్రతీకగా జరుపుకునే రక్షాబంధన్ వేడుక మున్సిపల్ సిబ్బందితో కలిసి జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు రాఖీ పండుగ శుభ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ సిబ్బందితో కలిసి జరుపుకోవడం పట్ల మున్సిపల్ సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వెంట మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఇంజనీరింగ్ విభాగం మరియు టౌన్ ప్లానింగ్ విభాగం మరియు శానిటేషన్ విభాగం మొదలగు అన్ని విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# కృష్ణాపురంలో కార్డెన్ సెర్చ్



**అసాంఘిక శక్తులకు ఎవరు సహకరించవద్దు**

**యువత గంజాయికి బానిస కావొద్దు : ఏఎస్పి శివ ఉపాధ్యాయ**

ములుగు జిల్లా వాజేడు మండలంలోని పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల కృష్ణపురం గ్రామంలో ములుగు జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఏఎస్పి శివ ఉపాధ్యాయ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ తనిఖీలు నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా గ్రామస్తులతో ఏఎస్పీ మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఎటువంటి సమస్య అయినా పోలీసులకు తెలియజేయాలని, అపరిచి అనుమానిత అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అసాంఘిక శక్తులకు సహకరించవద్దని తెలిపారు.

యువత గంజాయి మత్తు పదార్థాలు లాంటి వాటికి దూరంగా ఉండాలని దానికి బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ నిషేధిత గుడుంబాను ఎవరు అమ్మకూడదు మరియు తయారు చేయకూడదని అలా చేసినట్టు ఎవరికైనా తెలిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు.

అక్కడున్న ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ మీ సమస్య ఎటువంటిదైనా పోలీసులకు తెలియజేయాలని కచ్చితంగా మీ సమస్యను తీర్చడానికి ప్రయత్నం చేస్తామని వారికి హామీని ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో నూగురు వెంకటాపురం సిఐ బండారి కుమార్, వాజేడు సిఆర్పిఎఫ్ బెటాలియన్ సి/ కమాండర్ సతీష్, పేరూరు ఎస్సై జి కృష్ణ ప్రసాద్, ఎస్సైహరీష్, సివిల్ మరియు టి జి ఎస్ పి సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఫోటో గ్రఫీ దినోత్సవ వేడుకలు



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని తెలంగాణ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ టిపి జె ఏ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రేట్ కార్యాలయం జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జెండగే కే కె కట్ చేసి ఫోటో జర్నలిస్ట్స్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాల గర్భ%శీ%లో కలిసిన చరిత్ర ను సజీవంగా నిలిపేది ఫోటో అని జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జెండగే అన్నారు.ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ సభ్యులు టి పి జే ఏ జిల్లా అధ్యక్షుడు గంధమల్ల రాజు,ఉపాధ్యక్షులు కృపా నగర ఫణిదర్, గుజ్జ నరేష్, ప్రధాన కార్యదర్శి కోల్లోజు శివ కుమార్,కోశాధికారి మోగిలిపాక కనుక రాజు,సహాయ కార్యదర్శి ఎం డి జాకీర్ ,ప్రచార కార్యదర్శి కర్రె గణేష్, సభ్యులు దేశ్ పాండ్ నరసింహ,కృపా నగరం అభిలాష పాల్గొన్నారు.

# కెమెరా సృష్టికర్త లూయిస్ దాగురే గారికి ఘన నివాళులు

వరల్డ్ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా షాద్ నగర్ ముఖ్య కూడలిలో



ప్రపంచ ఫోటోగ్రాఫి దినోత్సవ సందర్భంగా షాద్ నగర్ ముఖ్య కూడలి చౌరస్తా లో కెమెరా సృష్టి కర్త లూయిస్ దాగురె చిత్రపటానికి ఐ ఫోకస్ పరూక్ నగర్ మండల్ ఫోటో %డ% వీడియో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా పూలమాలవేసి నివాళులు అర్పించడంజరిగింది.ఈ కార్యక్రమంలో ఐ ఫోకస్ పరూక్ నగర్ మండల్ ఫోటో %డ% వీడియో వెల్ఫేర్ అసోసియేషన్ మరియు జిల్లా కార్యవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

# కనిపించని హక్కుల కోసం ఇండియన్ ఈజ్ మెంట్ చట్టం

**హైదరాబాద్ పెన్ పవర్:**సమాజంలో ప్రతి మనిషీ తమ పొరుగు వారికి ఏదో ఒక రకంగా సహాయపడుతూనే ఉంటాడు. బయటకు కనపడే విధమైనవి మాత్రమే కాకుండా ప్రత్యేకించి చూస్తే తప్ప కనబడని సహాయాలు కూడా ఉంటాయి. ఇలా కనబడని సహాయాలు ప్రతి ఒక్కరికీ అవసరమైనవై కూడా ఉంటాయి. ఇలాంటి సహాయాలను ఒకరి నుండి మరొకరికి లభించే సౌలభ్యాలు అని కూడా చెప్పవచ్చు. వ్యక్తులు వారి వారి స్వస్థలాలకు లేదా పని చేసే ప్రదేశాలకు వెళ్ళడానికి తమ సొంత ఇంటి ముందునుండి లేదా తమ ఆధీనంలో ఉన్న స్థలం నుండి ఇతరులు నడవడానికి బాట లేదా దారి ఏర్పాటు చేయడం నీటి అవసరాలకు ఉపయోగించుకోవడానికి అనుమతి ఇవ్వడం గాలి వెలుతురు ధారాళంగా రావడాన్ని అడ్డుకోకుండా ఉండడం లాంటి సౌలభ్యాలను వ్యక్తులు నిరంతరం పొందుతూనే ఉంటారు. వ్యక్తుల మధ్య సత్సంబంధాలు ఉన్నంత కాలం ఇలాంటి సౌలభ్యాలకు ఎటువంటి అడ్డంకి ఉండదు. కానీ వ్యక్తుల మధ్య సత్సంబంధాలు చెడిపోయినప్పుడు సౌలభ్యాలు పొందుతున్న వ్యక్తుల పరిస్థితి ఏమిటి? వ్యక్తులు మాత్రమే కాకుండా కొన్ని సార్లు వారి కుటుంబాలు కూడా సమస్యల్లో పడతాయి. కొన్ని సందర్భాల్లో పరిస్థితులు జఠిలమై కుటుంబాల నుండి కొన్ని ఊర్ల మధ్య కూడా సమస్య విస్తరించే అవకాశం లేకపోలేదు. ఇలాంటి కారణాల వల్లనే సౌలభ్యాలు పొందడాన్ని కూడా ఒక హక్కుగా భావించి దానికోసం చట్టం చేయాల్సిన అవసరం ఏర్పడి ఉండవచ్చు. సాధారణంగా హక్కులనేవి మనిషి స్వేచ్ఛగా నిర్భయంగా జీవించడానికి అనువైన వాతావరణాన్ని కల్పిస్థాయి. ఈ స్వేచ్ఛలోనే మనం మనకు తెలియకుండానే బయటకు కనిపించని కొన్ని హక్కులను అనుభవిస్తున్నాం. మనిషి తన రోజువారీ జీవితంలో కొన్ని రకాల తనకే తెలియని హక్కులను కలిగి ఉండి వాటిని సమర్ధవంతంగా వినియోగించుకుంటూ కూడా వాటి గురించి పట్టింపు గాని అవగాహన గాని లేకుండా ఉంటున్నాడు. ఈ రకమైన హక్కులను అనుభోగహక్కులు అంటారు. ఇండియన్ ఈజ్ మెంట్ యాక్టు లేదా భారత అనుభోగహక్కుల చట్టం 1882 గా రూపొందించబడిన ఈ చట్టాన్ని సౌలభ్యాల చట్టం అని కూడా పిలుస్తారు. అందుకే జాతి మతం కులం భాష భేదాలు లేదా ఏవైనా ఇతర ఆర్థిక సామాజిక హోదాలతో సంబంధం లేకుండా అనుభోగహక్కులు సార్వత్రికమైనవై ఆయా సందర్భానుసారం పౌరులందరికీ సమానంగా వర్తిస్తాయి. 1882 నాటి ఇండియన్ ఈజ్మెంట్స్ చట్టం భారతదేశంలో ఇప్పటికీ అమలులో ఉంది.

అనుభోగహక్కు(సౌలభ్యాల హక్కు) అంటే ఒకరికి సొంతమైన ఆస్తిని కొన్ని పరిమితులకు లోబడి ఉపయోగించుకోవడానికి మరొకరికి ఉండే నాన్ పొసెసివ్ (యాజమాన్యపు హక్కు లేనిది) హక్కు. సౌలభ్యాల హక్కు అనేది సాధారణంగా ఒక రకమైన కనిపించని ఆస్థి హక్కుగా పరిగణించబడుతుంది. ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం ఒక వ్యక్తి యొక్క భూమిని ఉపయోగించడానికి దాని హక్కుదారులు కాని వేరొకరికి లేదా కొంతమందికి పరిమిత హక్కును అందించడానికి ఈజ్ మెంట్ చట్టం అవకాశం కల్పిస్తుంది. ఉదాహరణకు ఎవరైనా తమ పొరుగువారి భూమి మీదుగా తమ ఇంటికి లేదా ఒక పొలం నుండి మరొకరి పొలానికి చేరుకోవడానికి వారి భూమిలో నుండి దారిని ఉపయోగించుకునే సౌలభ్యాన్ని ఈ చట్టం కల్పిస్తుంది. ఈ హక్కును భూమి సొంతదారు లేదా యజమాని అడ్డుకోవడం కుదరదు. ఇది శాశ్వతమైన హక్కుగా కనిపించినప్పటికీ యాజమాన్య హక్కు కాదు. అలాగే భూమి సొంతదారుకు దారి హక్కు పొందుతున్న వారి వలన ఎలాంటి నష్టాన్ని కలిగించడాన్ని కూడా ఈ చట్టం అనుమతించదు. ఈస్ మెంట్ చట్టం లేదా అనుభోగహక్కుల చట్టం లేదా సౌలభ్యాల హక్కు చట్టం నాలుగు రకాల హక్కులను నిర్వచించింది. సతత అనుభోగహక్కు (కంటిన్యూస్ రైట్) అసతత అనుభోగహక్కు (డిస్కంటిన్యూస్ రైట్) ప్రకటిత మరియు అప్రకటిత అనుభోగహక్కు. ప్రతి పౌరుడూ స్వతహాగా తాను స్వేచ్ఛగా జీవించడానికి అవసరమైన రాజ్యాంగ బద్ధమైన హక్కులను కలిగి ఉంటాడు. తనకు సొంతమైన ఇండ్లు భవనాల మీద తన అజమాయిషీ కలిగివున్న భూములపైనా లేదా పొలాలు పంట చేలు లేదా ఇతర స్థిరాస్తులపైన సంపూర్ణ అధికారం మరియు హక్కును కలిగి ఉంటాడు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఇదే విధమైన హక్కులను కలిగి ఉంటారు. అయితే అదే సమయంలో ఇతరుల హక్కులకు భంగం కలగకుండా వారి అజమాయిషీలో వున్న భూములపైనా లేదా పొలాలు పంట చేలు లేదా ఇతర స్థిరాస్తులలో కొంత భాగంపైనా తాత్కాలికంగా గాని ఒక్కోసారి శాశ్వతమైన విధంగా గాని పరిమితులకు లోబడిన హక్కును కూడా పౌరులు కలిగి ఉంటారు. ఇటువంటి హక్కులకు కూడా చట్టబద్ధత కల్పిస్తూ రూపొందించబడిందే ఇండియన్ ఈజ్ మెంట్ చట్టం.

ఈ చట్ట ప్రకారం ఒక వ్యక్తి తన పొలానికి చేరుకోవడానికి మరొకరికి చెందిన పొలం మీదుగా వెళ్లేందుకు దారి హక్కును కలిగి ఉంటాడు. దీనిని అసతత అనుభోగహక్కు లేదా డిస్కంటిన్యూస్ రైట్ గా చెప్పవచ్చు. పంట కాలువలు లేదా నీటి కాలువలకు కూడా ఇదే వర్తిస్తుంది. ఈ హక్కును ఎవరూ కాదనలేరు. అలాగే ఒక వ్యక్తి తన ఇంటికి గాలి వెలుతురు ధారాళంగా వచ్చేందుకు ఆ వ్యక్తి ఇంటి పక్కన లేదా ముందు గానీ వెనుక గాని ఉండే గృహ యజమాని ఏ రకంగానూ అడ్డు పడకూడదు. దీనిని సతత అనుభోగహక్కు లేదా కంటిన్యూస్ రైట్ గా పిలవచ్చు. ఒక వ్యక్తికి చెందిన స్థలం నుండి లేదా ఇంటి మీదుగా ఒక నిర్దిష్టమైన ప్రయోజనాన్ని ఆశించి చేసే ఏదైనా పనిని ప్రకటిత అనుభోగహక్కుగా పిలుస్తారు. అంటే ఒక వ్యక్తి స్థలం మీదుగా నీటి సౌకర్యం (వాటర్ కనెక్షన్) లేదా డిష్ కేబుల్ వంటివి మరొకరి ఇంటికి పంపడానికి ఉపయోగించుకోవడం. ఈ పని గురించి అవగాహన ఉన్న వ్యక్తులు జాగ్రత్తగా గమనించినప్పుడు ఆ వివరాలు బయటకు తెలుస్తాయి. ఇక ఒక వ్యక్తి తన ఇంటి పక్కన గల ఖాళీ స్థలంలో తనకు ఇబ్బందికరమైన ఏదైనా నిర్మాణం జరుగుతుంటే దానిని ఆపగలిగె హక్కు అప్రకటిత అనుభోగహక్కుగా పిలువబడుతుంది. ఉదాహరణకు తన ఇంటి పక్కన గల ఖాళీ స్థలాల్లో మిల్లులు లేదా పేలుడు పదార్థాలకు సంబంధించిన గోడౌను ఇబ్బంది కలుగజేసే ఏవైనా నిర్మాణాలను ఆపే హక్కును ఇది సూచిస్తుంది. ఇది అప్రకటిత అనుభోగహక్కు. పౌరులందరూ తమ హక్కులను వినియోగించుకుంటూ ఇతరులకు నష్టం కలిగించకుండా పరోక్షంగా వారి హక్కులను కూడా పరిమితులకు లోబడి వినియోగించుకునే అవకాశాన్ని అనుభోగహక్కుల చట్టం కల్పిస్తుంది. అంతే కాకుండా ఇటువంటి హక్కులకు నిజమైన భంగం వాటిల్లినప్పుడు నష్ట పరిహారం కోసం దావా వేసే వెసులుబాటును కూడా ఈ చట్టం కల్పించింది. వందేళ్లకు పూర్వమే ఇలాంటి ఒక చట్టం రూపుదిద్దుకుందంటే సమస్య అనాది నుండే ఉందన్నమాట. అంతెందుకు రామాయణ మహాభారతాలలో జరిగిన యుద్దాలు సైతం ఒకరకంగా ఆస్థి హక్కుల కోసం జరిగినవే అంటే ఒప్పుకోవాల్సిందే(ధర్మ సంస్థాపన కోసం అనేది అసలు ఉద్దేశ్యం). అప్పుడంటే దేవతలు దగ్గరుండి మరీ సమస్యలు పరిష్కరించేవారని మనం నమ్ముతున్నాం. కానీ నేటి మన నాగరిక సమాజంలో ఇలాంటివి కుదరదు కదా. మనిషి తన హక్కులను అనుభవిస్తూ ఇతరుల హక్కులను కూడా పరిరక్షించడం ఎల్లకాలం కుదరదు. దీనికోసం బయట నుండి ఒక నియంత్రణ విధానం లేదా కట్టుబాటు అవసరం అవుతుంది. ఈ కట్టుబాట్లే రూపాతరం చెంది చట్టాలుగా అమలు చేయబడుతున్నాయి. ప్రతి చట్టం కూడా దేనికదే ప్రత్యేకమైంది. కానీ భారత అనుభోగహక్కుల చట్టం చాలా విలక్షణమైనది. మనవి కాని ఆస్తులపై కూడా ఒకరకమైన పరోక్ష హక్కులను ఈ చట్టం ప్రసాదించింది. ఐతే ఈ హక్కులను హక్కులుగా కాకుండా సౌలభ్యాలుగా మాత్రమే చూడాలి. మనం పొందే సౌలభ్యాలు ఇతరుల హక్కులను భంగపరచేవిగా ఉండకూడదనేది భారత అనుభోగహక్కుల చట్టం యొక్క ఉవాచ.

# శ్రీరామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న సురోజ్ బిల్డ్ కోన్ కంపెనీ పీఎం దిగంబర శివాజీ భోస్లే

**పరమేశ్వరుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి**

**హైదరాబాద్ పెన్ పవర్:**పరమేశ్వరుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలన్నీ సురోజ్ బిల్డ్ కోన్ కంపెనీ పీఎం దిగంబర శివాజీ భోస్లే అన్నారు. షాద్ నగర్ నియోజకవర్గంలోని రామేశ్వరంలో వేలిసిన శ్రీ రామలింగేశ్వర స్వామిని శ్రావణ సోమవారం , రాఖీ పౌర్ణమి సందర్భంగా పీఎం ప్రత్యేక దైవ దర్శనం చేసుకున్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... దేవుడి దయవల్ల రైతులకు మంచి వర్షాలు పడి పాడిపంటలు సమృద్ధిగా పండాలని అదేవిధంగా నియోజకవర్గ ప్రజలకు ఆ పరమేశ్వరుడి కృప ఉండాలని కోరారు. శ్రావణ సోమవారం రోజు రాఖీ పౌర్ణమి రావడం శుభపరిణామమని అన్నారు. రాఖీ పౌర్ణమి జరుపుకుంటున్న అక్క చెల్లెలకు శుభాకాంక్షలు తెలిపారు.ఆడపడుచులను ప్రతి ఒక్కరు అక్క చెల్లెల భావించి గౌరవించాలని ఈ సందర్భంగా వెల్లడించారు.అనంతరం వేద పండితులు సంపత్ కుమార్ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం పీఎంను సంపత్ కుమార్ శాలువాతో ఘనంగా సత్కరించారు. వారి వెంట రాఘవేంద్ర రాజ్ , జర్నలిస్టు మల్లికార్జున్ తదితరులు దైవ దర్శనం చేసుకున్నారు.

